ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 16.04.2024 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్ర ప్రభుత్వం ఈ సీజన్ లో రైతులకు వరి పంట బోనస్ ఇవ్వకపోవడాన్ని, బీజేపీ నేత, ఎంపీ కె. లక్ష్మణ్ తప్పుపట్టారు.
2. లోక్ సభ ఎన్నికల కోసం ఖమ్మం జిల్లాలో నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ వి పీ గౌతమ్ చెప్పారు.
3. రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతోంది. ఈ రోజు, రేపు రెండు నుంచి మూడు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగి, వడగాలుల వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.
4. భద్రాచలంలోని రామాలయంలో రేపు సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు.

--------

**లక్ష్మణ్-బీజేపీ**

రైతులకు వరి పంటకు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ .. మాటమార్చి వచ్చే సీజన్ కు ఇస్తామనడంపై తప్పుపట్టారు. బీజేపీ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ రైతులు ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేయాలో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని ఆయన కోరారు. బీఆర్ఎస్ మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం మాటల గారడీతో కాలం వెల్లదీస్తోందని విమర్శించారు. ఈ రోజు నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఈ సీజన్ లో రైతులకు వరి పంట బోనస్ ఇవ్వలేదని, వచ్చే సీజన్‌కు ఇస్తామని చెప్పడం భావ్యం కాదన్నారు.

ఎన్నికల కోడ్‌ను అడ్డుపెట్టుకొని గ్యారంటీల అమలు నుంచి తప్పించుకోవాలని చూస్తే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు.

**డెస్క్**

----------------------

**ఖమ్మం-కలెక్టర్**

లోక్ సభ ఎన్నికల కోసం ఖమ్మం జిల్లాలో నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ వి పీ గౌతమ్ చెప్పారు. ఈరోజు ఖమ్మం కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 18వ తేదీన నోటిఫికేషన్ విడుదలవుతుందని, ఆ రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ఉంటుందని చెప్పారు. అభ్యర్థులు తప్పనిసరిగా అన్ని వివరాలు పూర్తి చేసి నామినేషన్ పత్రాలను దాఖలు చేయాలని సూచించారు. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు విస్తృత చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాల్లో 18 వందల 96 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**PTC, (khammam )**

------------------------------

**కంటోన్మెంట్-బీజేపీ అభ్యర్థి**

సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసన సభ నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికకు బీజేపీ తమ అభ్యర్థిని ప్రకటించింది. అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా టీఎన్ వంశా తిలక్ పేరును ఖరారు చేస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యవర్గం ఈ రోజు క ప్రకటన విడుదల చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మ్రుతి చెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. మే 13న లోక్ సభ ఎన్నికలతో పాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీకి పోలింగ్ జరుగుతుంది. కాగా,

లాస్య నందిత సోదరి నివేదితను బీఆర్ఎస్ పార్టీ తమ అభ్యర్థిగా ప్రకటించగా... శ్రీ గణేష్ ను కాంగ్రెస్ తమ అభ్యర్థిగా ఇప్పటికే ప్రకటించింది.

**(డెస్క్)**

--------------------

**సంగారెడ్డి-కేసీఆర్ సభ**

లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఈ రోజు సంగారెడ్డి జిల్లాలో అందోల్ నియోజకవర్గం, జోగిపేట్ సమీపంలోని సుల్తాన్ పూర్ లో ఈ సాయంత్రం బీఆర్ఎస్ నిర్వహించే బహిరంగ సభ కు హాజరవుతారు.. సంగారెడ్డి - జోగిపేట్ మధ్యలోని సుల్తాన్పూర్ లో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొని కార్యకర్తలకు చంద్రశేఖర్ రావు దిశా నిర్దేశం చేస్తారు. ఈ సభను లక్ష మందితో విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ నేత, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, జహీరారాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్, మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకటరామిరెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని సంగారెడ్డి, పటాన్ చెరు, నర్సాపూర్, జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని అందోల్, నారాయణఖేడ్, జహీరాబాద్ నియోజకవర్గాల నుంచి, పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు నాయకులు, ప్రజలు హాజరుకానున్నారు.

**(SANGAREDDY, PTC)**

-------------------------------

**కామారెడ్డి- పౌరసరఫరాల కార్యదర్శి**

కామారెడ్డి జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల నిర్వహణ తీరు, మౌలిక సదుపాయాలు బాగున్నాయని రాష్ట్ర పౌరసరఫరాల ప్రిన్సిపల్ కార్యదర్శి దేవేంద్ర సింగ్ చౌహాన్ సంతృప్తి వ్యక్తం చేశారు. నిన్న రాత్రి కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. మౌలిక వసతుల గురించి రైతులను అడిగి తెలుసుకుని , జిల్లా అధికారులు వసతులు ఏర్పాటు చేసినందుకు సంతృప్తిని వ్యక్తం చేశారు. ధాన్యం సేకరణ

ప్రక్రియ ఎలాంటి ఒడుదుడుగులు లేకుండా సజావుగా, వేగవంతంగా జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు.

**(పీటీసీ, రాజన్న సిరిసిల్ల)**

----------------------------

**వాతావరణం**

రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతోంది. ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్, ఖమ్మం, భద్రాచలం, నల్లగొండ జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఈ రోజు, రేపు మరో మూడు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరుగుతాయని, పలు ప్రాంతాల్లో వడగాలుల కూడా వీస్తాయని అంచనా వేసింది. నిన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం గరిమెల్లపాడులో అత్యధికంగా 44.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో 41 డిగ్రీలపైన ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో రహదారులపై జన సంచారం తగ్గింది.

**(డెస్క్)**

-------------------------------

**వరంగల్- కమిషనర్**

లోక్ సభ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో నామినేషన్ ల సమర్పణ పై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన అవసరమని ఏఆర్ఓ, వరంగల్ బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. నిన్న సాయంత్రం బల్దియా ప్రధాన కార్యాలయంలో వరంగల్ తూర్పు నియోజక వర్గ పరిధిలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు నామినేషన్ ల దాఖలుపై అవగాహన కల్పించిన ఏ ఆర్ ఓ మాట్లాడుతూ వరంగల్ లోక్ సభ ఎన్నికలకు ఈనెల 18న నామినేషన్ ల ప్రక్రియ మొదలై 25 తో ముగుస్తుందన్నారు. నామినేషన్ సమర్పించే క్రమంలో అభ్యర్థులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

**(వరంగల్ జిల్లా, పిటిసి)**

--------------------------------------

**భద్రాచలం – టికెట్లు**

భద్రాచలంలోని రామాలయంలో రేపు సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవం జరగనుంది. దీనికి సంబంధించిన చికెట్లు ఆన్ లైన్ లో అందుబాటులోకి తెచ్చినట్లు అదికారులు తెలిపారు. 7500 రూపాయల ఉభయదాతల టికెట్టుతో వచ్చే భక్తలకు రేపు జరిగే కల్యాణానికి ప్రవేశంతో పాటు గోత్ర నామాలు చదివి, వస్త్రాలు, తలంబ్రాలు కూడా ఇస్తారని తెలిపారు. ఇవే కాకుండా 2000, 1000,300 రూపాయల విలువ చేసే టికెట్లు కూడా అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. కల్యాణాన్ని వీక్షించేందుకు వచ్చే భక్తలకు నీరు, టెంట్ ఇతర వసతులు కల్పించినట్లు తెలిపారు.

**పీఎస్**

----------------------------------

**వేములవాడ-నవమి**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం లో జరుగుతున్న శ్రీరామ నవరాత్రోత్సవాల్లో భాగంగా నిన్న రాత్రి అశ్వ వాహనంపై స్వామివార్లకు పెద్ద సేవ నిర్వహించారు. శ్రీపార్వతీ, రాజరాజేశ్వరస్వామివార్లు, శ్రీలక్ష్మీ సమేత అనంతపద్మనాభ స్వామి వార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. భారీ సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు.

**(పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా )**

-------------------------

**మహబూబాబాబాద్- 5 K రన్**

గత అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ శాతం కన్నా పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచాలని మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రం లో ఓటు హక్కు

ప్రాముఖ్యతను వివరిస్తూ... ప్రజల్లో అవగాహన పెంచేందుకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా నేను తప్పకుండా ఓటు వేస్తాను అనే నినాదంతో చేపట్టిన 5 కే రన్ కార్యక్రమాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ఓటును మించిన ఆయుధం లేదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని కోరారు.

**(మహబూబాబాద్ జిల్లా, పి టి సి)**

---------------------------------

**సిరిసిల్ల-స్టడీ సర్కిల్**

మైనార్టీ స్టడీ సర్కిళ్లలో మొదటి సారి ప్రవేశం కోరే అభ్యర్థులందరూ ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని, రాజన్న సిరిసిల్ల జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఆర్. వి. రాధాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. యూపీఎస్సీ, సివిల్ సర్వీసెస్ కు వంద మందికి ఉచిత కోచింగ్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 22లోగా సంబంధిత వెబ్ సైట్ లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 040-23236112 నంబరులో సంప్రదించాలని సూచించారు.

**(పిటిసి రాజన్న సిరిసిల్ల)**

----------------------------